**జనపథం - జనపదం**

# వ్యత్యాసం

- నిత్యానంద్.

***ఉప్పుకప్పురంబు నొక్కపోలికనుండు***
***చూడజూడ రుచుల జాడవేరు***
***పురుషులందు పుణ్యపురుషులు వేరయా!***

అన్నాడు వేమన. ఉప్పు, కర్పూరం ఒకే రకముగా ఉంటాయి. కాని వాటి వాటి ఉపయోగములు వేరు. కర్పూరం దైవార్చన సమయంలో ఉపయోగ పడుతుంది. మరి ఉప్పు దిష్టి (దృష్టి) తీసివేయడానికి ఉపయోగిస్తారు. కర్పూరం కరిగి మంచి సుగంధాన్ని వెదజల్లుతుంది. మరి ఉప్పుకు ఆ గుణం లేదు. అలాగే రకరకాల వ్యక్తులు మనచుట్టూ ఉన్నా నలుగురికి ఉపయోగపడుతూ జీవితం గడిపేవారు కొంతమందే ఉంటారు.

సృష్టిలో ఏ రెండు వస్తువుల మధ్యనైనా సారూప్యత (Similarity) ఉంటుందేమోగాని, సర్వసమానత్వం (నూటికి నూరు శాతం సమానం Identically Equal) ఉండదు. అంతెందుకు ఒకే చెట్టుకు కాచిన ఏ రెండు ఫలాలు ఒకే రకముగా ఉండవు. ఒకవేళ చూడడానికి రంగు అచ్చుగుద్దినట్లు ఒకే రకంగా ఉన్నా, వాటి రుచిలో తేడా ఉంటుంది. అలాగే ఈ విశాలమైన జగత్తులో ప్రతిప్రాణి, ప్రతి వస్తువు అనుపమానం, అనన్యం. సృష్టికర్త ఎంత నేర్పరి?

మన చేతి వేళ్ళు అంగుష్ఠము (బొట్టన వ్రేలు) నుండి చిటికెన వ్రేలు వరకు గమనిస్తే, అన్నీ ఒకేరకముగా లేవు. ఒకవేళ ఉన్నా పరిస్థితి అస్తవ్యస్తముగా ఉంటుంది. అలాగే మనం చూసే భిన్నమైన మతాలు కూడా! అన్ని మతాలూ ఒకే విధముగా ఉంటే వాటిలో విశేషమేముంది? పాఠశాలలో అధ్యాపకులు బోధించేటప్పుడు చురుకైన విద్యార్థికి ఒక రకంగా చెబితే, కాస్త మందకొడిగా ఉన్న విద్యార్థికి వేరొక విధముగా చెప్తారు. అలాగే వ్యక్తుల వికాసాన్ని బట్టి గురువులు శిష్యులకు బోధించే పద్ధతి మారుతుంది. లేకపోతే నేర్చుకున్నదానిని పరిపక్వత లేకపోవడము వలన దుర్వినియోగపరిచే అవకాశం ఉంది.

పూర్వం ఒక గురువుగారి వద్ద విద్య అభ్యసించిన నలుగురు శిష్యులు, విద్యానంతరం దేశాటనకై బయలుదేరారు. దారిలో వింతలూ విశేషాలు చూస్తూ, ఓ అరణ్య ప్రాంతము చేరుకున్నారు. దానిని దాటుతుండగా అక్కడ వారికి చెల్లాచెదురుగా ఉన్న ఎముకలు కనిపించాయి. శిష్యులలో మొదటివాడు "ఈ ఎముకలు సింహానికి సంబంధించినవి. నేను గురువుగారి వద్ద నేర్చుకున్న విద్యను వినియోగించి, ఈ ఎముకలను చేర్చి సింహ కళేబరమును ఏర్పరచెద"నని చెప్పి, అతని ప్రావీణ్యమును ఉపయోగించి సింహకళేబరమును కూర్చి మిగిలిన వారికి చూపెను. రెండవ శిష్యుడు వెంటనే "నేను గురువుగారి వద్ద

అభ్యసించిన విద్యను ఉపయోగించి ఈ సింహకళేబరమునకు రక్త మాంసములను చేకూర్చెద"నని అటులనే చేసెను. పిదప మూడవ శిష్యుడు "మీరు కళేబరమును కూర్చి, రక్తమాంసములు నింపితే, నేను గురువుగారి వద్ద నేర్చుకున్న విద్యతో దీనికి ప్రాణము పోయుదు"నని అందుకు ఉద్యుక్తుడవ్వగా, నాల్గవ శిష్యుడు రానున్న ఆపదను గుర్తించి, ఈ మృగమునకు ప్రాణము పోసి మన ప్రాణముల్పైకి తెచ్చుకొనడం వివేకము కాదని హితము చెప్పబోగా, మొదటి ముగ్గురు శిష్యులు అతనిని గేలిచేసెను. ఇక చేయునది లేక ఆతడు అక్కడనేయున్న ఓ ఎత్తైన వృక్షమును అధిరోహించి జాగ్రత్తపడగా, మూడవ శిష్యుడు ఆ జీవికి ప్రాణమునొసగెను. ఆ క్రూర మృగము ప్రాణ భయంతో ఆ ముగ్గురు శిష్యులను సంహరించెను. హితవచనములు లక్ష్యపెట్టక మృతులైన మిత్రులను చూసి నాల్గవశిష్యుడు చింతించి, ఆపై తన ప్రయాణము కొనసాగించెను. దీని వలన పరిపక్వత లేనివారికి బోధించడము ప్రమాద హేతువని అర్థమవుతుంది.

గురువు యొక్క ఉపదేశము ఒకటే అయినా, వినే శిష్యులు ఒక్కొక్కరు ఒక్కొక్క రకముగా అర్థము చేసుకొనే అవకాశమే ఎక్కువ. ఓ సంఘటన చూసినపుడు ఏ ఇద్దరు వ్యక్తుల అనుభవాలు ఒక విధముగా ఉండవు. అలాగే మతాలు కూడా ఆవిర్భవించాయి. ఈ విశ్వమును నియంత్రించే శక్తి ఒక్కటే. దానిని వేర్వేరు వ్యక్తులు వేరు వేరు విధములుగా దర్శించడమువలన వేరు వేరు సిద్ధాంతములు, మతములు ఏర్పడినవి. వీటన్నిటి గమ్యముకూడా ఒక్కటే! దానిని సరిగా అర్థము చేసుకోలేని వారు ప్రజలలో లేనిపోని స్పర్థలను కలుగజేసి, మతకలహాలను సృష్టిస్తున్నారు. సమస్య ఎక్కడో లేదు, మన ఆలోచనలలోనే ఉంది. సదాలోచన చేసేవారికి ద్వైతము, అద్వైతము, విశిష్టాద్వైతము, బౌద్ధ, జైన, ఇస్లాము, క్రిష్టియన్ అనే తేడా ఉండదు. వారు అన్ని ప్రాణులలో తమని, తమలో అన్ని ప్రాణులను దర్శించగలిగి, సుఖదు:ఖములను ఒకేవిధముగా చూడగలిగి, స్థితప్రజ్ఞత కలిగి ఉంటారు.

మన ప్రక్కవాడు ఏదో విషయములో ఉన్నత స్థితి పొందాడని, వాని ఇంట్లో ఉన్న 72" టీ.వీ. మన దగ్గర లేదని, ఇలా అక్కరకు రాని విషయములతో మన మనసులను నింపి, అరిషడ్వర్గములకు ఆతిధ్యమిచ్చి, మన జీవితాలనే కాక మన చుట్టూ ఉన్న వారి జీవితాలను నరక ప్రాయము చేసికొంటున్నాము. సరే ఒక కోరిక తీరినందువల్ల ఆనందం కలుగుతుందా? అంటే మరొక కోరిక జీవం పోసుకుంటుంది. మనము అద్దె ఇంటికి వెళ్ళినప్పుడు మనకు కేటాయించిన గది - మనము ప్రవేశించే సమయానికి ఎంత శుభ్రముగా ఉందో, అలాగే మనము విడిచిపెట్టే సమయానికి కూడా అంతే శుభ్రముగా ఉంచడం ధర్మము. అలాగే మనము ఈ భూమి మీద పడినపుడు ఎంత స్వచ్ఛమైన మనసుతో ఉన్నామో, అలాగే శరీరం విడిచిపెట్టేటప్పుడు అదే స్వచ్ఛతతో ఉంచగలిగితే ధన్యులం. అదే జన్మరాహిత్యానికి మార్గం.

*వచ్చే సంచికలో 'పేను - పెసరచేను' కథ గురించి విశ్లేషణ.*